సాక్షి
ఏలూరు
శుక్రవారం । 17 । ఫిబ్రవరి । 2023



శ్రీవారి ట్రస్టుకు విరాళం

ద్వారకాతిరుమల: శ్రీవారి నిత్యాన్నదాన ట్రస్టుకు గురువారం తణుకు మండలం పైడిపర్రుకు చెందిన అలుమోలు సుబ్బారావు రూ. 3,65,000 విరాళంగా అందజేశారు.



సర్పాభరణం బహూకరణ

నిడమర్రు: బువ్వనపల్లిలోని సుబ్రహ్మణ్యేశ్వర స్వామికి దాత సంకు పుల్లయ్యనాయుడు, సత్యనారాయణ సోదరులు సర్పాభరణం బహూకరించారు.

సరస్వతీ అమ్మవారికి పూజలు



జంగారెడ్డిగూడెం రూరల్: గురవాయిగూడెం అయ్యప్ప క్షేత్రం ఉపాలయంలో కొలువై ఉన్న జ్ఞాన సరస్వతి అమ్మవారికి గురువారం ప్రత్యేక పూజలు నిర్వహించారు.

న్యూస్‌రీల్

బలివే దేవస్థాన ట్రస్ట్ బోర్డు ప్రమాణం



బలివే దేవస్థాన ట్రస్ట్ బోర్డు సభ్యుల ప్రమాణ స్వీకారోత్సవం

బలివే(ముసునూరు): ఎనిమిది మంది సభ్యులతో కూడిన బలివే దేవస్థాన ట్రస్ట్ బోర్డ్ సభ్యులు గ్రామ సర్పంచ్ రావు ప్రవీణ సుధాకర్ అధ్యక్షతన గురువారం దేవస్థాన ప్రాంగణంలో ఎమ్మెల్యే మేకా వెంకట ప్రతాప్ అప్పారావు సమక్షంలో ప్రమాణం చేశారు. చైర్మన్‌గా నాగుల నాగేశ్వరరావుతో ఈఓ తల్లాప్రగడ విశ్వేశ్వరరావు ప్రమాణం చేయించారు. అనంతరం సభ్యులుగా నరదల లక్ష్మణరావు, చిల్లిముంత నిర్మల, జంపిన రాహేలు, మూతినేని రాంబాబు, కాండూరి పద్మలత, చిలకలపూడి జితేంద్ర, ఎక్స్ అఫీషియో సభ్యుడిగా ఆలయ అర్చకులు తోలేటి అరుణభాస్కరరావులతో ప్రమాణాలు చేయించారు.

జూనియర్ సివిల్ జడ్జిల నియామకం

ఏలూరు (టూటౌన్): ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లాకు జూనియర్ సివిల్ జడ్జిలను నియమిస్తూ హైకోర్టు రిజిస్ట్రార్ ఉత్తర్వులు జారీ చేశారు. కర్నూలు జిల్లా నుంచి వి.రఘునాథ్‌ను ఏలూరు ఫస్ట్ అడిషనల్ జూనియర్ సివిల్ జడ్జిగా, మంగళగిరి నుంచి ఎస్.వాసుదేవ్ ఏలూరు సెకండ్ అడిషనల్ జూనియర్ సివిల్ జడ్జిగా బదిలీ అయ్యారు. తణుకు ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జిగా పి.బాబు, జంగారెడ్డిగూడెం ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జిగా కె.రాజరాజేశ్వరి నియమితులయ్యారు.

ఎన్నికల నిర్వహణకు ఫ్లయింగ్ స్క్వాడ్ల నియామకం

ఏలూరు(మెట్రో): పశ్చిమ గోదావరి జిల్లా స్థానిక సంస్థల ఎమ్మెల్సీ ఎన్నికల నిర్వహణకు ఫ్లయింగ్ స్క్వాడ్లను నియమిస్తూ రిటర్నింగ్ అధికారి పి.అరుణ్ బాబు గురువారం ఉత్తర్వులు జారీ చేశారు. ఎన్నికల ప్రవర్తనా నియమావళి ఖచ్చితంగా అమలు చేస్తూ ఎన్నికలు సజావుగా ప్రశాంత వాతావరణంలో నిర్వహించేందుకు 48 స్క్వాడ్లను నియమించారు. ఈ బృందాలు ఎలాంటి ఫిర్యాదులు వచ్చినా వెంటనే స్పందించి చర్యలు తీసుకోవాలని చట్టప్రకారం కేసులు నమోదు చేయాలని సూచించారు.

గూడెం రెవెన్యూ డివిజన్‌లోకి గణపవరం

గణపవరం: గణపవరం మండలాన్ని పశ్చిమ గోదావరి జిల్లాలో నూతనంగా ఏర్పాటు చేయబోయే తాడేపల్లిగూడెం రెవెన్యూ డివిజన్‌లో కలపడానికి ప్రభుత్వం రాజపత్రం విడుదలచేసింది. ఈ మేరకు గురువారం దీనిపై అభ్యంతరాలు ఉంటే 30 రోజుల లోపు తెలియచేయాలని కోరారు. ఏలూరు జిల్లాలో ఉన్న గణపవరాన్ని పశ్చిమగోదావరిలో కలపడానికి ముఖ్యమంత్రి వైఎస్ జగన్ హామీ ఇచ్చారు. ఈ మేరకు భీమవరం రెవెన్యూ డివిజన్‌లోకి మారాల్సిఉంది. ఈ లోగా తాడేపల్లిగూడెం రెవెన్యూ డివిజన్ ఏర్పాటుతో అందులో కలపనున్నారు.

అక్రమ మందుల దందా

- విచ్చలవిడిగా మత్తు మందుల విక్రయాలు
- జాబితాలో నిద్రమాత్రలు, అబార్షన్ కిట్‌లు, వయాగ్రా
- ఉమ్మడి జిల్లాలో డ్రగ్ అధికారుల దాడులు



ఇటీవల ఔషధ నియంత్రణ అధికారులు స్వాధీనం చేసుకున్న మందులు

తణుకు: వైద్యుల మందుల చీటీలపై విక్రయించాల్సిన మందులు కొందరికీ సులువుగా దొరుకుతున్నాయి. ఈ నేపథ్యంలో తణుకులో తీగ లాగితే... డొంక మాత్రం జిల్లాలు, రాష్ట్రాలు దాటింది. ఈ మందుల విక్రయాలపై అధికారులు జరుపుతున్న దాడుల్లో విస్తుపోయే వాస్తవాలు వెలుగు చూస్తున్నాయి. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా ఇటీవల ఔషధ నియంత్రణ శాఖ అధికారులు చేపట్టిన దాడుల్లో పెద్ద ఎత్తున అక్రమ మందులు స్వాధీనం చేసుకున్న విషయం తెలిసిందే. తణుకు పట్టణంలో తీగ లాగిన అధికారులు ఈ మందులు ఎక్కడ నుంచి వస్తున్నాయనే విషయంపై ఆరా తీస్తున్నారు. తణుకు పట్టణానికి చెందిన వ్యాపారి ఒకరు నిద్రమాత్రలు మింగి ఆత్మహత్య చేసుకున్న విషయం తాజాగా వెలుగులోకి వచ్చింది. ఈనెల 6న రాత్రి నిద్రమాత్రలు మింగిన అతను అపస్మారక స్థితిలోకి చేరుకోవడంతో మరుసటి రోజు తణుకులోని ప్రైవేటు ఆసుపత్రిలో చేర్పించారు. చికిత్స పొందుతూ ఈ నెల 8న మృతి చెందారు. ఈ సంఘటనతో తణుకు డ్రగ్ ఇన్‌స్పెక్టర్ అబిద్ ఆలీ ఆధ్వర్యంలో ఈ నెల 11 నుంచి దాడులు చేపట్టారు. ఇంతవరకు అధికారులు నిర్వహించిన దాడుల్లో సుమారు రూ. 25 లక్షల వరకు అక్రమ మందులు స్వాధీనం చేసుకున్నారు.

మందుల చీటీ ఉంటేనే

సాధారణంగా నిద్రమాత్రలు విక్రయించాలంటే వైద్యులు రాసిన మందుల చీటీ ఉండాలి. అయితే తణుకు పట్టణంలోని పలు మందుల దుకాణాల్లో ఎలాంటి మందుల చీటీ లేకుండాలనే నిషేధిత మందులు విక్రయిస్తున్నట్లు వెలుగులోకి వచ్చింది. ఈ జాబితాలో నిద్రమాత్రలతోపాటు వయాగ్రా, గర్భవిచ్ఛిత్తికి వినియోగించే మాత్రలు పెద్ద ఎత్తున విక్రయిస్తున్నారు. ఇందుకు ఇటీవల అధికారుల దాడుల్లో స్వాధీనం చేసుకున్న మందులే నిదర్శనం. ఇదిలా ఉంటే నిద్రమాత్రలు మింగి ఆత్మహత్య చేసుకున్న వ్యక్తి తణుకు పట్టణంలోని రాష్ట్రపతి రోడ్డులో ఒక మందుల షాపులో పెద్ద మొత్తంలో కొనుగోలు చేసినట్లు సమాచారం. ఈ సమాచారంతోనే నిఘా పెట్టిన ఔషధ నియంత్రణ అధికారులు విస్తృతంగా దాడులు నిర్వహించారు. తణుకు పట్టణానికి చెందిన ముగ్గురు వ్యక్తులపై కేసులు నమోదు చేసిన అధికారులు వీరిచ్చిన సమాచారంతో భీమవరం, ఏలూరు ప్రాంతాల్లో దాడులు నిర్వహించి అక్రమ మందులను స్వాధీనం చేసుకున్నారు.

పొరుగు రాష్ట్రాల నుంచి...

ఈ అక్రమ మందులను పొరుగు రాష్ట్రాల నుంచి దిగుమతి చేసుకుంటున్నట్లు తెలుస్తోంది. ముఖ్యంగా బెంగళూరు, హైదరాబాదు ప్రాంతాల్లో ప్రముఖ కంపెనీల్లో మేనేజర్లుగా వ్యవహరిస్తున్న కొందరు అక్రమార్కులు ఈ చీకటి వ్యాపారంలో ఉన్నారని అనుమానిస్తున్నారు.

బెంగళూరు నుంచి ఏలూరుకు దిగుమతి చేసుకుంటున్న అక్రమార్కులు ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా ఏజెంట్లను నియమించుకుని వారి ద్వారా హోల్ సేల్, రిటైల్ మందుల షాపులు, ఆర్ఎంపీ, పీఎంపీలకు విక్రయిస్తున్నట్లు తెలుస్తోంది. మరోవైపు ఎలాంటి అనుమానం రాకుండా ఈ అక్రమ రవాణాకు ఆర్టీసీ కార్గోను వాడుకుంటున్నారు. తాజాగా భీమవరంలో ఆర్టీసీ కార్గో ద్వారా మందులు రవాణా చేస్తున్నట్లు అధికారులు గుర్తించారు.

పార్శిల్ రూపంలో అబార్షన్ కిట్‌లు



భీమవరంలో స్వాధీనం చేసుకున్న అక్రమ అబార్షన్ కిట్‌లు

భీమవరం(ప్రకాశం చౌక్): భీమవరం, చుట్టు పక్కల ప్రాంతాల్లోని కొందరు ఆర్ఎంపీలు, క్లినిక్‌ల నిర్వాహకులకు అక్రమ అబార్షన్ కిట్‌లు మెడికల్ ఏజెన్సీల్లో పనిచేసే వారి ద్వారా చేరుతున్నాయి. ఇతర ప్రాంతాల నుంచి పట్టణానికి పార్శిల్ రూపంలో కొరియర్, ట్రాన్స్‌పోర్టు సర్వీసు ద్వారా అందుతున్నాయి. వీటిని రహస్యంగా అబార్షన్‌లకు ఉపయోగించుకుని డబ్బులు దండుకుంటున్నారు. అక్రమ అబార్షన్ కిట్‌లపై ఔషధ నియంత్రణ అధికారులకు సమాచారం అందితే వారు దాడులు చేసి మందులను స్వాధీనం చేసుకుని కేసులు నమోదు చేస్తున్నారు. గతంలో భీమవరంలో సుమారు 2 లక్షల విలువ చేసే కిట్‌లు స్వాధీనం చేసుకుని కేసులు నమోదు చేయగా తాజాగా బుధవారం రూ.3.90 లక్షల విలువ చేసే అబార్షన్ కిట్‌లు పట్టుకుని కేసులు నమోదు చేశారు.

కోటగిరిని కలిసిన డీఎన్నార్, జయమంగళ



ఎంపీ కోటగిరి శ్రీధర్‌ను కలిసిన ఎమ్మెల్యే డీ.నాగేశ్వరరావు, మాజీ ఎమ్మెల్యే జయమంగళ వెంకటరమణ

దెందులూరు: ఏలూరు ఎంపీ కోటగిరి శ్రీధర్‌ను గురువారం ఆయన నివాసంలో కైకలూరు ఎమ్మెల్యే దూలం నాగేశ్వరరావు, మాజీ ఎమ్మెల్యే, వైఎస్సార్‌సీపీ నేత జయమంగళ వెంకటరమణ మర్యాదపూర్వకంగా కలిశారు. జయమంగళ వెంకటరమణ గురువారం సీఎం వైఎస్‌జగన్‌మోహన్‌రెడ్డి సమక్షంలో వైఎస్సార్‌సీపీలో చేరిన సంగతి విదితమే. ఈ నేపథ్యంలో ఎమ్మెల్యే నాగేశ్వరరావుతో కలిసి ఎంపీ శ్రీధర్‌ను కలిశారు. కొల్లేరులో పార్టీ అభివృద్ధి, బలోపేతానికి సమన్వయంతో కృషి చేయాలని ఎంపీ కోటగిరి అన్నారు. వారి వెంట ఏపీ ఫారెస్ట్ కార్పొరేషన్ డైరెక్టర్ పళ్ళెం ప్రసాద్ ఉన్నారు.

నేడు పోలవరం ప్రాజెక్టు పరిశీలించనున్న మంత్రులు

పోలవరం రూరల్: పోలవరం ప్రాజెక్టు నిర్మాణ పనులను రాష్ట్ర జలవనరుల శాఖ మంత్రి అంబటి రాంబాబు శుక్రవారం పరిశీలించనున్నారు. ప్రాజెక్టు నిర్మాణ పనుల్లో భాగంగా దిగువ కాఫర్‌డ్యామ్ పనులు పూర్తయ్యాయి. ఈ సందర్భంగా మంత్రి అంబటి రాంబాబుతో పాటు పలువురు మంత్రులు, ఎంపీలు, ఎమ్మెల్యేలు క్షేత్రస్థాయిలో పనుల పురోగతిని పరిశీలిస్తారు.

ఎన్నికల మార్గదర్శకాలు కచ్చితంగా పాటించాలి



వీడియో కాన్ఫరెన్స్ ద్వారా అధికారులకు సూచనలు చేస్తున్న జేసీ పి.అరుణ్‌బాబు

ఏలూరు(మెట్రో): పశ్చిమ గోదావరి జిల్లా స్థానిక సంస్థల నియోజకవర్గం ఎమ్మెల్సీ ఎన్నికల నిర్వహణలో ఎన్నికల సంఘం జారీ చేసిన మార్గదర్శకాలు, నిబంధనలను కచ్చితంగా పాటించాలని జిల్లా ఎన్నికల రిటర్నింగ్ అధికారి పి.అరుణ్ బాబు అన్నారు. గురువారం ఎన్నికల నిర్వహణకు సంబంధించి కలెక్టరేట్ నుంచి నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో ఎన్నికల నిర్వహణకు చేపట్టాల్సిన అంశాలను వివరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికలు ప్రశాంత వాతావరణంలో సాగేందుకు ఎన్నికల కమిషన్ జారీ చేసిన నియమ నిబంధనలను, సూచనలను తెలియజేశారు. సంబంధిత పోలింగ్ స్టేషన్లలో ఏర్పాట్లను ముందస్తుగా పరిశీలించుకోవాలన్నారు. ఎంపీటీసీలకు అవసరమైన గుర్తింపు కార్డులు జారీ చేయాలన్నారు. ఎన్నికల ప్రవర్తనా నియమావళి కచ్చితంగా అమలు చేయాలన్నారు. రోజువారీ మద్యం విక్రయ వివరాలను అందజేయాలని ఎక్సైజ్ శాఖ అధికారులను ఆదేశించారు. ఎంసీసీ కమిటీలు అప్రమత్తంగా ఉండి సమర్థవంతంగా పనిచేయాలన్నారు. జిల్లా రెవిన్యూ అధికారి ఏవీఎస్ఎస్ మూర్తి, ఎస్ఈబీ అదనపు ఎస్పీ ఎస్.సూర్యచంద్రరావు, ఏలూరు ఆర్‌డీవో కె.పెంచలకిషోర్, జెడ్పీ సీఈవో కె.వి.ఎస్.ఆర్.రవికుమార్, డ్వామా పీడీ డి.రాంబాబు, కలెక్టరేట్ ఏవో ఎ.రమాదేవి, ఎక్సైజ్ జిల్లా సూపరింటెండెంట్ ఎన్.బాలకృష్ణన్, డీఈఓ ఎన్.వి.రవిసాగర్ తదితరులు పాల్గొన్నారు.

10లో ఉత్తమ ఫలితాలే లక్ష్యం



10వ తరగతి పరీక్షలపై వర్క్‌షాప్‌లో మాట్లాడుతున్న డీఈఓ రవిసాగర్

ఏలూరు (ఆర్ఆర్‌పేట): 10వ తరగతి పరీక్షల్లో ఉత్తమ ఫలితాలు సాధించడమే లక్ష్యంగా 40 రోజుల కార్యచరణ ప్రణాళిక రూపొందించినట్లు విద్యాశాఖాధికారి ఎన్వీ రవిసాగర్ స్పష్టం చేశారు. స్థానిక సమగ్రశిక్ష సమావేశ మందిరంలో రవి సాగర్ అధ్యక్షతన విషయ నిపుణులతో వర్క్‌షాప్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చదువులో వెనుకబడిన విద్యార్థులు సైతం ఉత్తీర్ణులయ్యేలా కార్యచరణ రూపొందించామన్నారు. 10వ తరగతి విద్యార్థులకు అదనపు తరగతులు నిర్వహించడానికి నిర్ణయించామని, అదనపు తరగతులకు హాజరయ్యే విద్యార్థులకు జిల్లా పరిషత్ చైర్మన్ కవురు శ్రీనివాస్ ఆర్థిక సహకారం అందిస్తామని హామీ ఇచ్చారని చెప్పారు. ఉపాధ్యాయులు విద్యార్థులకు మార్గనిర్దేశనం చేసి మంచి ఉత్తీర్ణతా శాతాన్ని తీసుకురావాలని సూచించారు.

జిల్లాలో ఎన్నికల సందడి

- స్థానిక సంస్థల ఎమ్మెల్సీ నోటిఫికేషన్ జారీ
- జిల్లాలో ఇద్దరికి అవకాశం
- అధికార పార్టీ నుంచి ఎన్నిక లాంఛనమే
- మొదటిరోజు నామినేషన్లు నిల్



ఏలూరు కలెక్టరేట్ నామినేషన్ కేంద్రం వద్ద బందోబస్తు పరిశీలిస్తున్న ఆర్‌డీఓ కిషోర్, డీఎస్పీ పైడేశ్వరరావు

సాక్షి ప్రతినిధి, ఏలూరు: ఉమ్మడి పశ్చిమ గోదావరిలో ఎన్నికల సందడి మొదలైంది. స్థానిక సంస్థల కోటా నుంచి ప్రస్తుతం ప్రాతినిధ్యం వహిస్తున్న ఇద్దరు సభ్యుల పదవీకాలం ముగియనుండటంతో భారత ఎన్నికల సంఘం ఎన్నికల నోటిఫికేషన్ విడుదల చేసింది. ఈ క్రమంలో జిల్లా నుంచి అధికార పార్టీకి చెందిన ఇద్దరు శాసనమండలి సభ్యులు ఎన్నిక లాంఛనం కానుంది. ఎన్నికల షెడ్యూల్ ఇప్పటికే ప్రకటించడంతో జిల్లాలో ఎన్నికల కోడ్ అమలులోకి వచ్చింది. గురువారం నోటిఫికేషన్ జారీ కావడంతో ఎన్నికల నిర్వహణకు అవసరమైన పనులు నిర్వహించడంతో పాటు జిల్లాలో ఎన్నికల కోడ్ పక్కాగా అమలు చేస్తున్నారు.

2017లో టీడీపీ నుంచి జిల్లాలో స్థానిక సంస్థల కోటాలో అంగర రామ్మోహనరావు, మంతెన సత్యనారాయణరాజు ఎన్నికయ్యారు. మే1తో పదవీకాలం ముగియనుండటంతో ఎన్నికల నోటిఫికేషన్ విడుదలైంది. స్థానిక సంస్థల ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ 85 శాతం స్థానాలు దక్కించుకుని జిల్లాలోని బలమైన రాజకీయ శక్తిగా ఎదిగింది. ఈ క్రమంలో రెండు ఎమ్మెల్సీ స్థానాలు వైఎస్సార్‌సీపీ అభ్యర్థులకై వసం చేసుకోనున్నారు. మరోవైపు నోటిఫికేషన్ జారీ అయిన క్రమంలో జిల్లా యంత్రాంగం ఎన్నికల నిర్వహణకు అన్ని ఏర్పాట్లు చేసింది. గురువారం నుంచి 23 వరకు నామినేషన్ల స్వీకరణ, 24న నామినేషన్ల పరిశీలన, 27న నామినేషన్ల ఉపసంహరణ ప్రక్రియ నిర్వహించనున్నారు. మార్చి 13న ఉదయం 8 నుంచి సాయంత్రం 4 వరకు పోలింగ్ నిర్వహించి 16న ఓట్ల లెక్కింపు నిర్వహిస్తారు.

ఉమ్మడి జిల్లాలో 1105 మందికి ఓటు హక్కు

ఉమ్మడి జిల్లాలో స్థానిక సంస్థల ఎన్నికల్లో 1,105 మంది ప్రజాప్రతినిధులు తమ ఓటు హక్కు వినియోగించుకోనున్నారు. 48 మంది జెడ్పీటీసీలు, 856 మంది ఎంపీటీసీలు, 180 మంది కార్పొరేటర్లు, కౌన్సిలర్లు, 21 మంది నగరపాలక, పురపాలక సంఘాల ఎక్స్‌అఫిషియో సభ్యులు, 15 మంది శాసనసభ్యులు, ఇద్దరు పార్లమెంటు సభ్యులు, నలుగురు ఎమ్మెల్సీలు మొత్తంగా 1,105 మంది తమ ఓటు హక్కు వినియోగించుకోనున్నారు.

ఐదు పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు

జిల్లాలో ఐదు పోలింగ్‌స్టేషన్లు ఎంపిక చేశారు. ఏలూరు పోలింగ్ స్టేషన్‌ను ఏలూరు ఎంపీడీఓ కార్యాలయంలో ఏర్పాటు చేయగా జంగారెడ్డిగూడెంకు సంబంధించి ఎంపీడీఓ కార్యాలయంలో, కొవ్వూరుకు సంబంధించి ఎంపీడీఓ కార్యాలయంలో ఏర్పాటుచేశారు. నర్సాపురానికి సంబంధించి ఎంపీడీఓ కార్యాలయంలో పోలింగ్ కేంద్రం ఏర్పాటు చేశారు. భీమవరానికి సంబంధించి భీమవరం ఎంపీడీఓ కార్యాలయంలో పోలింగ్ కేంద్రాన్ని ఏర్పాటు చేశారు.

తొలిరోజు నామినేషన్లు నిల్

గురువారం నుంచి నామినేషన్ స్వీకరణ ప్రక్రియకు ఏలూరు కలెక్టరేట్‌లో ఏర్పాట్లు చేశారు. మొదటి రోజు నామినేషన్లు దాఖలు కాలేదు. 18న శివరాత్రి, 19న ఆదివారం ఈ రెండు సెలవు దినాల్లో నామినేషన్లు స్వీకరించరు. 23న మధ్యాహ్నం 3 గంటల వరకు కలెక్టరేట్‌లోని జాయింట్ కలెక్టర్, రిటర్నింగ్ అధికారి పీ.అరుణ్‌బాబు నామినేషన్ల స్వీకరిస్తారు.

సుందరగిరిపై ప్రారంభమైన మహాయజ్ఞం





యాగశాలలో శాలిగ్రామార్చనను నిర్వహిస్తున్న రుత్వికులు, యాగశాలలో ఏర్పాటు చేసిన కలశాలు

ద్వారకాతిరుమల: సుందరగిరిపై స్వయంభూగా కొలువైన శ్రీ లక్ష్మీనరసింహ స్వామి ఆలయంలో మహా సంపుటిత శ్రీ లక్ష్మీనృసింహ ధన్వంతరీ 28వ మహా యజ్ఞం గురువారం వైభవంగా ప్రారంభమైంది. మహా శివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకుని ఈనెల 18న రాత్రి ఈ మహాయజ్ఞాన్ని అట్టహాసంగా నిర్వహించనున్నారు. అందులో భాగంగా ప్రారంభం రోజు ఆలయంలో విశేష పూజాధికాలు నిర్వహించారు. ద్వారకాతిరుమల చినవెంకన్న ఆలయానికి దత్తత దేవాలయమైన, ఐఎస్.జగన్నాథపురంలోని ఈ ఆలయంలో ఏకాదశి పర్వదినం సందర్భంగా యజ్ఞ నిర్వాహకులు కొచ్చెర్లకోట సత్యవెంకట లక్ష్మీనరసింహ గురూజీ యజ్ఞక్రతువును ప్రారంభించారు. ముందుగా యాగశాలలో ఏర్పాటు చేసిన శాలిగ్రామాలకు తులసీదళాలతో అర్చనను జరిపారు. సాయంత్రం గర్భాలయంలోని స్వామివారి మూలవిరాట్ కు గురూజీతో పాటు, యజ్ఞ పర్యవేక్షకులు సీహెచ్.కుటుంబరావు, అర్చకులు, పండితులు వేద మంత్రోచ్ఛరణలతో మహన్యాస పూర్వక ఏకాదశి రుద్రాభిషేకాన్ని, పంచామృతాభిషేకాలను నిర్వహించారు. అనంతరం యాగశాలలో 1331 కలశాలను ఏర్పాటు చేసి, నవనారసింహ హోమాన్ని వేడుకగా జరిపారు.

ఉమ్మడి పరీక్షల కార్యదర్శిగా సర్వేశ్వరరావు

ఏలూరు (ఆర్ఆర్‌పేట): ఉమ్మడి పశ్చిమ గోదా వరి జిల్లా ఉమ్మడి పరీక్షల బోర్డు కార్యదర్శిగా ఏ.సర్వేశ్వర రావును నియమిస్తూ జిల్లా విద్యాశాఖాధికారి ఎన్వీ రవిసాగర్ గురువారం ఉత్తర్వులు జారీ చేశారు. ప్రస్తుతం శనివారపు పేట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో గ్రేడ్–2 ప్రధానోపాధ్యాయుడిగా పని చేస్తున్న సర్వేశ్వరరావుకు గురువారం రవి సాగర్ నియామకపత్రాన్ని అందచేశారు. సర్వేశ్వర రావు మూడు సంవత్సరాల పాటు ఈ పదవిలో కొనసాగనున్నారు.

సెల్ పోయిందా.. డోంట్ వర్రీ !

- ఏలూరు జిల్లాలో రూ.1.05 కోట్ల సెల్‌ఫోన్ల రికవరీ
- బాధితులకు 501 ఫోన్లు అప్పగింత



బాధితులకు సెల్‌ఫోన్ అందజేస్తోన్న జిల్లా ఎస్పీ రాహుల్‌దేవ్ శర్మ

ఏలూరు టౌన్: సెల్‌ఫోన్ పోయిందని పోలీస్‌స్టేషన్‌కు వెళ్తే గతంలో పట్టించుకునే వారే కాదు. ఎవరైనా తెలిసిన వాళ్ళతో చెప్పించినా ప్రయోజనం ఉండేది కాదు. రికవరీ మాట అటుంచి కేసు నమోదు చేయని పరిస్థితి.

నేడు సెల్ ఫోన్ పోయిందా.. డోంట్ వర్రీ.. అంటూ పోలీస్ అధికారులే భరోసా ఇస్తున్నారు. పోలీస్‌స్టేషన్‌కు సైతం రానక్కరలేదు. కేవలం పోలీస్ సైబర్ క్రైమ్ సెల్ వాట్సాప్ నెంబర్‌కు వివరాలు ఇస్తే చాలు.. మీ సెల్‌ఫోన్ వెతికి మరీ మీకు అప్పగిస్తామని చెబుతున్నారు. రాష్ట్రాలు దాటి వెంటాడి.. వేటాడి మరీ సెల్‌ఫోన్లను రికవరీ చేసి బాధితులకు అందజేసి శెభాష్ అనేలా ఏలూరు జిల్లా పోలీసులు తమ ప్రతిభ చాటుకుంటున్నారు. ఏలూరు జిల్లా ఎస్పీ రాహుల్‌దేవ్ శర్మ ప్రత్యేక చొరవతో సెల్‌ఫోన్ బాధితులకు ఊరట లభిస్తోంది.

రూ.కోటి 5 లక్షల ఫోన్ల రికవరీ

ఎస్పీ రాహుల్‌దేవ్ శర్మ ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటూ సైబర్‌క్రైమ్ సెల్‌ను ఏర్పాటు చేశారు. అటు నేర పరిశోధ.. మరోవైపు సెల్‌ఫోన్ల రికవరీతో సీసీఎస్ పోలీసులు, సైబర్ సెల్ పోలీసులు తమ సత్తా చాటుకుంటున్నారు. ఏలూరు సీసీఎస్ డీఎస్పీ జీవీఎస్ పైడేశ్వరరావు పర్యవేక్షణలో ఏలూరు సీసీఎస్ సీఐ సీహెచ్ మురళీకృష్ణ, సైబర్ సెల్ ఎస్సై రాజా, పోలీస్ బృందం అత్యుత్తమ స్థాయిలో ప్రతిభ కనబరుస్తూ సెల్‌ఫోన్లు రికవరీ చేస్తున్నారు. ఐదు దశల్లో ఏకంగా రూ.1 కోటి 5 లక్షల విలువైన సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకుని బాధితులకు అందజేశారు.

మొబైల్ ఫోన్లు రికవరీ ఇలా.. ఏలూరు జిల్లా వ్యాప్తంగా ఐదు దశల్లో భారీగా మొబైల్ ఫోన్లను రికవరీ చేశారు. తమ సెల్‌ఫోన్లు చోరీ లేదా పోయాయంటూ వాట్సాప్ నెంబర్‌కు ఫిర్యాదు చేయగా 66 శాతం రికవరీ చేయటం విశేషం.

ఫేజ్	ఫిర్యాదులు	సెల్‌ఫోన్ల రికవరీ	విలువ (రూ.లలో)
ఫేజ్ –1	96	80	16,00,000
ఫేజ్–2	141	94	20,50,000
ఫేజ్–3	168	108	22,00,000
ఫేజ్–4	180	103	21,21,800
ఫేజ్–5	222	116	25,66,384
	807	501	1,05,38,184

ప్రజలకు ఉత్తమ సేవలే లక్ష్యం



ఏలూరు జిల్లాలోని ప్రజలకు అత్యుత్తమ స్థాయిలో పోలీస్ సేవలు అందించాలనే లక్ష్యంతో పనిచేస్తున్నాం. ఇప్పటికే సైబర్ క్రైమ్ సెల్ ఏర్పాటు చేశాం. ఏలూరు సీసీఎస్ స్టేషన్ డీఎస్పీ, సీఐ స్థాయి అధికారులు నిత్యం ప్రత్యేక నిఘాతో నేరాలు అదుపు చేసేందుకు పటిష్ట చర్యలు చేపడుతున్నారు. ఏలూరు జిల్లాలో ఐదు ఫేజుల్లో సుమారుగా రూ.1 కోటి 5 లక్షల విలువైన మొబైల్ ఫోన్లు బాధితులకు అందజేశాం. రాష్ట్ర చరిత్రలోనే ఎన్నడూలేని విధంగా సైబర్‌క్రైమ్ సెల్ ఏర్పాటు చేసి ప్రజలకు సేవలు అందిస్తున్నాం.

– రాహుల్ దేవ్ శర్మ, ఏలూరు ఎస్పీ

మీ మొబైల్ పాగొట్టుకున్నా.. చోరీ చేసినా..
వెంటనే ఈ వాట్సప్ నెంబర్ మీవద్ద ఉంటే చాలు ..
పోలీస్‌స్టేషన్ల చుట్టూ తిరిగాల్సిన పనిలేదు.
ఏలూరు జిల్లా పోలీసులు ఎంతో ప్రతిష్టాత్మకంగా సైబర్ సెల్ ఏర్పాటు చేసి ప్రజలకు ఉత్తమ సేవలు అందిస్తున్నారు.

ఎలా చేయాలంటే ? :

- ముందుగా 95503 51100 ఫోన్ నెంబర్‌కు వాట్సప్‌లో హాయ్ అని టైప్ చేయాలి.
- అనంతరం ఫోన్‌లో లింక్ కనిపిస్తుంది
- లింక్‌లోకి వెళ్ళగానే మిస్సింగ్ మొబైల్ ప్రొఫార్మా ఓపెన్ అవుతుంది.
- ఈ ప్రొఫార్మాలో మీ చిరునామా, వివరాలు, మొబైల్ ఫోన్ వివరాలు, ఐఎంఈఐ నెంబర్, ఫోన్ నెంబర్ పొందుపర్చాలి.
- మీరు ఏ ప్రాంతంలో ఉంటున్నారు, ఎలా పోయింది, సమీప పోలీస్‌స్టేషన్ వివరాలు పూర్తి చేయాలి.

పోక్సో కేసులో నిందితుడికి 20 ఏళ్ల జైలు

ఏలూరు (టూటౌన్): పోక్సో కేసులో ఓ వ్యక్తి నేరం రుజువు కావడంతో 20 ఏళ్ల జైలు శిక్ష, రూ.5 వేల జరిమానా విధిస్తూ పోక్సో కోర్టు జడ్జి పి.ఉమాసునంద గురువారం తీర్పు చెప్పారు. పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. 2021 ఆగస్టు 9వ తేదీ సాయంత్రం ఏలూరులోని తూర్పువీధిలో ఓ బార్ వద్ద బాలికపై అత్యాచారం చేసినట్లు అందిన ఫిర్యాదుపై అప్పట్లో కేసు నమోదు చేసి దిశ డీఎస్పీ కేవీ సత్యనారాయణ దర్యాప్తు చేసి 24 గంటల్లోనే నిందితుడిని అరెస్టు చేశారు. రెండు నెలల్లో కేసు దర్యాప్తు పూర్తి చేసి సాక్ష్యాలతో చార్జీషీట్ ఫైల్ చేశారు. ఈ కేసు విచారణలో భాగంగా వాదోపవాదాలు అనంతరం గురువారం జడ్జి ఉమాసునంద తుది తీర్పు ఇచ్చారు. ఈ కేసులో నిందితుడు నాగిశెట్టి విజయ్‌కుమార్ (46) నేరం రుజువు కావడంతో 20 ఏళ్ల జైలు శిక్షతో పాటు రూ.5వేలు జరిమానా విధిస్తూ జడ్జి తీర్పునిచ్చారు. జరిమానా చెల్లించని పక్షంలో మరో ఆరు నెలలు జైలు శిక్ష అనుభవించాలని తీర్పులో పేర్కొన్నారు. బాధితురాలికి నష్టపరిహారంగా రూ.ఒక లక్ష మంజూరు చేశారు. ఈ కేసులో బాధితురాలి తరుపున ప్రాసిక్యూటర్ తేతలి శశిధర్‌రెడ్డి వాదనలు వినిపించారు. దిశ డీఎస్పీ కేవీ సత్యనారాయణ, దిశ సీఐ కె.ఇంద్ర శ్రీనివాసరావు, కానిస్టేబుళ్లను ఎస్పీ రాహుల్ దేవ్ శర్మ ప్రత్యేకంగా అభినందించారు.

గంగాధరా.. లోక శుభంకరా

- శైవక్షేత్రాల్లో ప్రారంభమైన మహాశివరాత్రి ఉత్సవాలు
- గునుపూడి పంచారామక్షేత్రంలో అభిషేకాలు, ప్రత్యేక పూజలు



ప్రత్యేక అలంకరణలో భీమేశ్వరస్వామివారు



గునుపూడిలోని శ్రీసోమేశ్వరస్వామివారికి అభిషేకాలు చేస్తున్న అర్చకులు

భీమవరం (ప్రకాశంచౌక్): ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లాలోని పలు శైవక్షేత్రాల్లో మహాశివరాత్రి ఉత్సవాలు వైభవంగా ప్రారంభమయ్యాయి. తెల్లవారుజాము నుంచే ఆలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించగా, భక్తులు పెద్ద సంఖ్యలో స్వామివార్లను దర్శించుకున్నారు. భీమవరంలోని పంచారామక్షేత్రంలో కొలువైన శ్రీ ఉమా సోమేశ్వరస్వామివారికి తెల్లవారుజాము నుంచి ఏకాదశ రుద్రాభిషేకాలు, లక్షపత్రి పూజలు, అమ్మవారికి కుంకుమ పూజలు నిర్వహించారు. రాత్రి ధ్వజారోహణం వాహన సేవలు జరిపారు. భీమేశ్వరస్వామి ఆలయంలో మహాశివరాత్రి మహోత్సవాల మొదటి రోజు స్వామివారికి ప్రత్యేక అభిషేకాలు, లక్షబిల్వార్చన పూజలు చేశారు. శ్రీ మహిషాసురమర్దిని అమ్మవారికి ప్రత్యేక కుంకుమ పూజలు నిర్వహించారు.

ఆచంటలో మొదలైన శివరాత్రి సందడి

పెనుగొండ: ఆచంటలోని శ్రీ ఉమారామేశ్వర స్వామి (ఆచంటేశ్వరస్వామి) వారి కల్యాణోత్సవాలు గురువారం ప్రారంభమయ్యాయి. వివిధ ప్రాంతాల నుంచి ఆచంట చేరుకుంటున్న భక్తులు, చిరు వ్యాపారులతో శివరాత్రి సందడి మొదలైంది. కచేరి సెంటరు నుంచి స్వామివారి సత్రం వరకూ పెద్ద ఎత్తున స్టాల్స్ ఏర్పాటు చేశారు. రంగు రంగుల విద్యుత్ దీపాలంకరణ ఆకట్టుకుంటున్నాయి. స్వామివారి కల్యాణమహోత్సవం సందర్భంగా స్వామివారు, అమ్మవార్లకు గురువారం ఆలయ కమిటీ అధ్యక్షుడు నెక్కంటి రామలింగేశ్వర రావు పట్టువస్త్రాలు సమర్పించారు. ఉదయం నుంచి స్వామివారికి ప్రత్యేక అభిషేకాలు. శ్రీ పార్వతి అమ్మవారికి కుంకుమ పూజలు చేశారు. స్వామివారి కళావేదికపై సాంస్కృతిక కార్యక్రమాలు, సత్రంలో అన్నదానం ప్రారంభించారు. శ్రీస్వామివారి గ్రామోత్సవం వివిధ వాహనాలపై కన్నులపండుగగా సాగింది.

పెండ్లి కుమారుడైన పాతాళ భోగేశ్వరుడు



స్వామివారికి పట్టువస్త్రాలు సమర్పిస్తున్న నెక్కంటి రామలింగేశ్వరరావు, రామచంద్రకుమార్

కైకలూరు (కలిదిండి): కలిదిండి సమీపంలోని శ్రీపాతాళ భోగేశ్వరస్వామి కల్యాణ మహోత్సవాలు గురువారం ప్రారంభమయ్యాయి. ఉదయం మాఘ బహుళ ఏకాదశి సందర్భంగా విఘ్నేశ్వరపూజ, స్వామివార్ని, అమ్మవార్ని పెండ్లి కొడుకు, పెండ్లి కుమార్తెలను చేశారు. సాయంత్రం పుణ్యాహవాచనం, దీక్షాదారణ, త్రిశూలపూజ, అంకురారోహణ, వాస్తుపూజ, అగ్ని ప్రతిష్ఠ, ధ్వజరోహణ, బలిహారణ పూజలను అర్చకులు ఐలూరు శ్రీకృష్ణ బసవయ్య, ఉమాశంకర శర్మలు నిర్వహించారు. ఈ నెల 20వ తేదీ వరకు కొనసాగే ఉత్సవాల్లో భాగంగా ఈ నెల 17 రాత్రి స్వామి వారి దివ్య కల్యాణ్యం, 18న మహాశివరాత్రి ఉత్సవం (తీర్థం), అదే రోజు రాత్రి హంస వాహనంపై స్వామివారి తెప్పోత్సవం నిర్వహించనున్నారు.

అమ్మవారి విగ్రహం ఏర్పాటుపై ఉద్రిక్తత



ఆకివీడు రాళ్ల చెరువు ప్రాంతంలో స్థానికుల మధ్య వాగ్వివాదం దృశ్యం

ఆకివీడు: అమ్మవారి విగ్రహం ఏర్పాటుపై పట్టణంలోని రాళ్ల చెరువు వద్ద ఉద్రిక్తత నెలకొంది. గాంధీనగర్‌కు చెందిన శ్రీకృష్ణదేవరాయ యూత్ ఆధ్వర్యంలో 14 ఏళ్లుగా రాళ్ల చెరువు ప్రాంతంలో కనకదుర్గమ్మ అమ్మవారి నవరాత్రి ఉత్సవాలు నిర్వహిస్తున్నారు. ఈ ప్రాంతంలో అమ్మవారి విగ్రహం ఏర్పాటుకు బుధవారం రాత్రి దిమ్మె నిర్మించారు. దీనిని ఆ ప్రాంత స్థానికులు, రజకులు అడ్డుకున్నారు. గురువారం యూత్ సభ్యులు దిమ్మెపై అమ్మవారి విగ్రహం ఏర్పాటు చేయడంతో మాదివాడ దళితులు, రజకులు అడ్డుపడటంతో ఉద్రిక్తత నెలకొంది. తమ పేటకు సమీపంలో అమ్మవారి విగ్రహం ఏర్పాటు చేయడం తగదని, తాము అంబేడ్కర్ విగ్రహం ఏర్పాటు చేసుకుంటామని చెప్పడంతో వాగ్వివాదం చోటు చేసుకుంది. ఘటనా స్థలానికి ఆకివీడు రూరల్ సీఐ గీతా రామకృష్ణ, ఎస్సై కే.రాజారెడ్డి, పోలీసులు చేరుకున్నారు. ఇరువర్గాల్ని వారించి పంపించివేశారు. అయితే మధ్యాహ్నం పోలీసులు లేని సందర్భంలో మరోసారి ఉద్రిక్తత నెలకొనగా, నగర పంచాయతీ కమిషనర్ సూచనల మేరకు అమ్మవారి విగ్రహాన్ని ఆ ప్రాంతం నుంచి తొలగించారు. సమస్య పరిష్కరించేందుకు మూడు రోజుల సమయం ఇవ్వాలని పెద్దలు అధికారులను కోరారు. పెద్దల విజ్ఞప్తితో ఇరువర్గాలు అక్కడ నుంచి నిష్క్రమించారు.

గడపగడపకు సంక్షేమం



ముసునూరు: వలసపల్లిలో గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో లబ్ధిదారులకు ప్రభుత్వ సంక్షేమ పథకాల బ్రోచర్‌ను అందిస్తున్న నూజివీడు ఎమ్మెల్యే మేకా వెంకట ప్రతాప్ అప్పారావు

నేటి నుంచి పట్టిసీమకు ప్రత్యేక బస్సులు

తాడేపల్లిగూడెం అర్బన్: మహాశివరాత్రి సందర్భంగా తాడేపల్లిగూడెం ఆర్టీసీ డిపో నుంచి పట్టిసీమకు శుక్రవారం మధ్యాహ్నం 2 గంటల నుంచి 19వ తేదీ వరకు ప్రత్యేక బస్సులు ఏర్పాటు చేసినట్లు డిపో మేనేజర్ యేలూరి సత్యనారాయణ గురువారం చెప్పారు. శుక్రవారం నుంచి ఉదయం 4 గంటల నుంచి వీరంపాలెంకు ప్రత్యేక బస్సులను ఏర్పాటు చేశామన్నారు. సాధారణ చార్జీలతోనే ప్రత్యేక బస్సులను నడుపుతున్నట్లు వెల్లడించారు.

ఎస్సీలపై దాడులు చేస్తే కఠిన చర్యలు

ఎస్సీ కమిషన్ చైర్మన్ విక్టర్ ప్రసాద్



భీమవరం సమావేశంలో మాట్లాడుతున్న విక్టర్‌ప్రసాద్

సాక్షి, భీమవరం : ఎస్సీ, ఎస్టీలపై దాడులు చేస్తున్న వారిపై పోలీసులు కేసులు నమోదు చేసి కఠిన చర్యలు తీసుకోవాలని ఎస్సీ కమిషన్ చైర్మన్ ఎం.విక్టర్‌ప్రసాద్ అన్నారు. గురువారం భీమవరంలో నిర్వహించిన ఎస్సీ, ఎస్టీ అఖిల పక్ష సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్ర వ్యాప్తంగా ఎస్సీలకు అనేక సమస్యలు ఉన్నాయని, వారికి అందాల్సిన అనేక సంక్షేమ పథకాలు సక్రమంగా అందడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఎస్సీ ఎస్టీ సబ్‌ప్లాన్ నిధులు సక్రమంగా వినియోగించడమేగాక ప్రైవేట్ రంగంలో వారికి రిజర్వేషన్ కల్పించాలన్నారు. ఎస్సీలకు ప్రత్యేకంగా శ్మశానవాటికలు ఏర్పాటు చేయాలని కలెక్టర్లకు వినతిపత్రాలను అందించామన్నారు. ఎస్సీ కమిషన్ ఎంతో బాధ్యతగా పనిచేస్తోందని, ఎస్సీలకు ఎటువంటి సమస్య వచ్చినా సంబంధిత అధికారులతో చర్చించి సమస్య పరిష్కారానికి కృషి చేస్తున్నామన్నారు. ఈ సమావేశంలో కొనా జోసెఫ్, తాళ్లూరి మధు, పడమటి బాలకృష్ణ, సోడదాసి గంగయ్య, సీహెచ్ మంగరాజు, గుమ్మాపు వరప్రసాద్, బుంగా ఆదాము, మట్టి రాజ్‌కుమార్, సోడదాసి శ్రీధర్, బూసి బెనర్జీ, నక్కా శాస్త్రి, కోరం ముసలయ్య, కేసీ రాజు, రమేష్‌బాబు పాల్గొన్నారు.

అందిన కాడికి అప్పు... ఆనక ఐపీ

- గణపవరంలో పెరుగుతున్న వైట్ కాలర్ నేరాలు
- ఘొల్లుమంటున్న పేద, మధ్య తరగతి ప్రజలు
- ఏడాది వ్యవధిలో రూ.100 కోట్ల పైనే ఎగవేత



గణపవరంలో ఇటీవల సమావేశమై తమకు రావాల్సిన సొమ్ముల విషయమై చర్చిస్తున్న బాధితులు

గణపవరం: తినో తినకో పైసా పైసా కూడబెట్టి వడ్డీ సొమ్ముకు ఆశపడి అప్పులిస్తున్న పేద, మధ్య తరగతి ప్రజలను నిలువునా ముంచేస్తున్నారు కొందరు మోసగాళ్లు. సమాజంలో పరువు పోతుందనే భయంతో తమకు జరిగిన మోసాన్ని బయటకు చెప్పుకోలేక మౌనంగా నష్టాలను భరిస్తున్నారు. అయితే అప్పు చేసిన వారు మాత్రం ఏ లోటూ లేకుండా దర్జాగా బతికేస్తూ, రహస్యంగా ఇతర ప్రాంతాల్లో విలువైన ఆస్తులను బినామీ పేర్లతో కొని అప్పులిచ్చిన వారికి మాత్రం ఐపీ పెట్టి చుక్కలు చూపిస్తున్నారు. అతని వద్ద ఉన్న మిగిలిన కొద్దిపాటి ఆస్తిపాస్తులను బాధితులు పంచుకుంటే రూపాయికి పావలా, పదిపైసల చొప్పున దక్కుతున్నా.. కొన్ని సందర్భాలలో అదీ కూడా అందడం లేదు. ఇలాంటి మోసాలు గణపవరం మండలంలో ఇటీవల ఎక్కువయ్యాయి. ఇలా ఏడాది వ్యవధిలోనే ఇటువంటి మోసాల వల్ల మండలంలోని ప్రజలు సుమారు రూ.100 కోట్ల వరకు నష్టపోయారంటే అర్థం చేసుకోవచ్చు పరిస్థితి ఎంత తీవ్రంగా ఉందో. గణపవరం పరిసర ప్రాంతాలలో ఇటీవల అనధికార ఐపీలు ఎక్కువగా వెలుగు చూశాయి. భారీగా అప్పులు చేసి వ్యాపారంలో నష్టం వచ్చిందంటూ కొందరు ప్రజలకు భారీగా టోకరా వేశారు.

- నాలుగురోజుల క్రితం గణపవరానికి చెందిన ఒక చిట్టీల వ్యాపారి దాదాపు రూ.15 కోట్లకు పైగా ప్రజలనెత్తిన శఠగోపం పెట్టాడు. ఇతను ప్రజల నుంచి పెద్దమొత్తంలో వడ్డీలకు అప్పులు తీసుకుని నాలుగు రోజులుగా కుటుంబంతో సహా కనిపించకుండా పోవడంతో బాధితులు లబోదిబోమంటున్నారు. ఫోన్ స్విచ్ఛాఫ్ చేసి ఉండటంతో అప్పులిచ్చిన వారు అతని ఇంటి చుట్టూ తిరుగుతున్నారు. ఈ విషయం వెలుగులోకి రావడంతో అతనికి అప్పులు ఇచ్చిన వారంతా రోడ్డెక్కారు. ఒక్కొక్కరు రూ.10 లక్షల నుంచి రూ.50 లక్షలు, రూ.1 కోటి వరకూ వడ్డీకి అప్పులు ఇచ్చినట్లు చెబుతున్నారు. బాధితులంతా ఇటీవల ఒకచోట సమావేశమై భవిష్యత్ కార్యాచరణపై చర్చించారు. ఇంకా బయటకు రానివారు చాలా మంది ఉన్నారని, మొత్తానికి రూ.15 కోట్లకు పైగానే లెక్క తేలుస్తున్నారు.
- అలాగే రెండు నెలలక్రితం గణపవరంలోనే మరో వ్యాపారి సుమారు రూ.10 కోట్లకుపైగా ప్రజల నుంచి అప్పులు చేసి పత్తా లేకుండా పోయాడు. ఇతనిబారిన పడినవారిలో ఉన్నత వర్గానికి చెందిన మహిళలు ఎక్కువగా ఉన్నట్లు చెబుతున్నారు. భర్తలకు తెలియకుండా ఇతనికి రూ.లక్షలను వడ్డీకి ఇచ్చి నిలువునా మోసపోయారు.
- గతంలో గణపవరంలో మరో ఎరువుల వ్యాపారి దాదాపు రూ.20 కోట్లకు ప్రజలకు టోకరా వేశాడు. బాధితులంతా ఇతనిని పట్టుకుని పెద్దల సమక్షంలో తగవు పెడితే అతనిచ్చిన ఆస్తుల జాబితా చూసి బాధితులు నోరెళ్లబెట్టారు. ఆ ఆస్తులను అమ్మితే బాధితులకు రూపాయికి పావలా కూడా వచ్చే పరిస్థితి లేదు. అవి అన్నీ బ్యాంకు తనఖాల్లో ఉన్న ఆస్తులు కావడంతో వాటిని విడిపించడానికే రూ.కోట్లు పెట్టుబడి పెట్టాల్సిన పరిస్థితి. దీంతో బాధితులకు దిక్కుతోచని పరిస్థితి ఏర్పడింది. అలాగే అంతకు ముందు కొందరు చేపల వ్యాపారులు చేపలు, రొయ్యల రైతులకు దాదాపు రూ.50 కోట్లకు పైగా టోకరా వేశారు. ఇదంతా కేవలం ఏడాది వ్యవధిలో జరిగిన మోసాలే. ఇలాంటి ఐపీలు ఆక్వా రంగంలో అధికంగా జరుగుతున్నాయి. పరిస్థితి ఇలాగే కొనసాగితే ముందుముందు ఇలాంటి ఐపీలు చాలా వెలుగులోకి వస్తాయని ప్రచారం జరుగుతోంది.

తాటాకిల్లు దగ్ధం

కైకలూరు: ఆటపాకలో విద్యుత్ షార్ట్ సర్క్యూట్ కారణంగా అగ్ని ప్రమాదం సంభవించి ఓ తాటాకిల్లు దగ్ధమైంది. గ్రామంలోని కాల్వగట్టుపై విశ్రాంత ఎఫ్‌సీఐ సిబ్బంది పాలపర్తి జోబుకు చెందిన తాటాకింట్లో మూడు గదుల్లో కూలి చేసుకునే కొచ్చర్ల ఏస్తేరు రాణి, బొజ్జ ఎలీషారాణి, కంకిపాటి మరియమ్మ కుటుంబాలు అద్దెకు ఉంటున్నాయి. గురువారం ఇంట్లో వీరు లేని సమయంలో విద్యుత్ షార్ట్ సర్క్యూట్ కారణంగా ఒక్కసారిగా మంటలు వ్యాపించాయి. అగ్నిమాపక సిబ్బంది ఘటనా స్థలానికి చేరుకుని మంటలను అదుపు చేశారు.

ఎస్సై అభ్యర్థులకు హెల్ప్ డెస్క్‌లు

ఏలూరు జిల్లా ఎస్పీ రాహుల్‌దేవ్ శర్మ



ఏలూరు టౌన్: ఏలూరు జిల్లా పరిధిలో ఎస్సై పోస్టులకు ఈ నెల 19న నిర్వహించే ప్రిలిమినరీ రాత పరీక్షకు హాజరయ్యే అభ్యర్థుల కోసం రైల్వేస్టేషన్లు, బస్టాండ్‌లలో ప్రత్యేక హెల్ప్‌డెస్క్‌లు ఏర్పాటు చేస్తున్నట్లు జిల్లా ఎస్పీ రాహుల్‌దేవ్ శర్మ చెప్పారు. గురువారం జిల్లా పోలీసు ప్రధాన కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ ఏలూరు నగరం, పరిసర ప్రాంతాల్లో 14 పరీక్షా కేంద్రాలు ఏర్పాటు చేశామని, మొత్తం 9014 మంది అభ్యర్థులు ఈ పరీక్షకు హాజరుకానున్నారన్నారు. పరీక్షా కేంద్రాలను చేరుకునేందుకు మార్గాన్ని తెలియజేసే రేఖా చిత్రాన్ని సైతం హెల్ప్ డెస్క్‌ల వద్ద అభ్యర్థుల అవగాహన కోసం ఏర్పాటు చేశామన్నారు. పరీక్షా కేంద్రాల వద్ద డీఎస్పీ నుంచీ ఎస్సై స్థాయి అధికారులతోపాటు భారీగా పోలీస్ బందోబస్తు ఉండేలా జాగ్రత్తలు తీసుకున్నామని వివరించారు. అభ్యర్థులు సకాలంలో పరీక్షా కేంద్రాలకు చేరుకోవాలని, ఎలాంటి అదనపు సమయాన్ని ఇవ్వరనే విషయాన్ని అభ్యర్థులు గుర్తించాలన్నారు. అలాగే హాల్‌టికెట్‌తో పాటు ఏదైనా గుర్తింపు కార్డును విధిగా వెంట తీసుకుని రావాలని సూచించారు.

అత్యాచార యత్నంపై కేసు నమోదు

పెదవేగి: అప్పు చెల్లించాలంటూ ఇంటికి వెళ్లి అడగగా అత్యాచారయత్నానికి పాల్పడ్డాడంటూ ఓ మహిళ పోలీసులను ఆశ్రయించింది. ఎస్సై ఎం.లక్ష్మణ్ తెలిపిన వివరాలిలా ఉన్నాయి. రాట్నాలకుంట గ్రామానికి చెందిన ఏలేటి దేవమాత అనే మహిళ, అదే గ్రామానికి చెందిన తేరా ప్రసాద్ అనే వ్యక్తికి రూ.5 లక్షలు అప్పు ఇచ్చింది. అప్పు ఇచ్చిన సొమ్ము తిరిగివ్వాలని ఈ నెల 1న ప్రసాద్ ఇంటికి వెళ్లగా తనపై అత్యాచారయత్నం చేశాడని వాపోయింది. ఈ విషయాన్ని పెద్దల్లో పెట్టినా పరిష్కారం కాకపోవడంతో బాధితురాలి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.